క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు జూన్ 10 చివరి గడువు

వరంగల్: వరంగల్‌లోని ప్రభుత్వ (బాలుర), ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో ట్రేడ్‌లు, ఐటీఐలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై కనిష్ట వయస్సు 14 ఏళ్లు ఉండాలని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

1న దత్తక్షేత్రంలో హనుమాన్ జయంతి

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో జూన్ 1వ తేదీన హనుమాన్ జయంతి వేడుకను నిర్వహించనున్నట్లు దత్తక్షేత్రం ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా హనుమాన్ మూర్తికి చందనం, అభిషేకాలు, వడమాల అలంకరణ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్



వరంగల్: నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ (ఎన్‌సీడబ్ల్యూసీ) వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరంగల్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అడప మహేశ్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షబ్బీర్‌అలీ మదానీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీవైఎస్‌ఓకు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలు, క్రీడా వసతి గృహాలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షక కమిటీ సభ్యుడిగా నియమితులైన హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోతు అశోక్‌ను క్రీడా శాఖ కోచ్‌లు ఘనంగా సన్మానించారు. స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో డీవైఎస్‌ఓను బుధవారం అభినందించారు.

గణేశ్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం కోమటిపల్లి ప్రాంతంలోని నిరూప్‌నగర్ తండాకు చెందిన దివ్యాంగుడు కేలోతు గణేశ్ డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ గణేశ్‌కు డాక్టరేట్ పట్టాను అందజేసింది. 'ఆన్ ఇంటరాక్టివ్ అప్రోచ్ టూ టీచింగ్ లిజెనింగ్ బంజారా ట్రైబల్' అనే అంశంపై గణేశ్ పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ సువర్ణలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధక వ్యాసాన్ని సమర్పించారు. పదవ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్‌అయిన గణేశ్.. పట్టుదలతో ఓపెన్ ఇంటర్, దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. చిన్నతనంలోనే రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. డాక్టరేట్ పట్టా అందుకోవడంపై గణేశ్‌కు కుటుంబ సభ్యులు, బంధువు, మిత్రులు అభినందనలు తెలిపారు.

కూరగాయల మార్కెట్‌లో యువకుడి మృతి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లోని కవర్‌షెడ్‌లో లక్ష్మీపురానికి చెందిన సిలివేరు సురేష్(32) అనే యువకుడు వడదెబ్బతో బుధవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం మార్కెట్‌లో కూరగాయల అమ్మకాలు ముగిసిన వెంటనే వ్యాపారులు ఇళ్లకు వెళ్లిపోవడం వల్ల కవర్‌షెడ్‌లో మొత్తం ఖాళీగా ఉంటోంది. దాంతో మధ్యాహ్నం చుట్టుపక్కల వారు వచ్చి షెడ్‌లోని ఫ్లాట్‌ఫాంలపై నిద్రపోతుంటారు. మృతి చెందిన సురేష్‌కు వివాహం కాలేదని, కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. మార్కెట్ అధికారుల ఫిర్యాదు మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు వచ్చి సురేష్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

క్రిస్టియన్‌కాలనీలో కూలి..

కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్‌కాలనీ జంక్షన్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన పెసరు రాజేష్ (45) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై క్రిస్టియన్‌కాలనీ జంక్షన్‌లో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దాంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

బార్ ఏర్పాటును నిరసిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు

కాజీపేట: జనావాసాల మధ్య బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు వ్యాపారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై ఉన్న దేవాలయాలకు అతి సమీపంలో బార్ ఏర్పాటు చేయాలని చూడడం వ్యాపారులకు తగదని సమస్య తీవ్రతను కలెక్టర్‌కు కాలనీవాసులు విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి బార్ ఏర్పాటు అంశంపై విచారణ జరిపించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



దామెర: యాగంలో పాల్గొన్న భక్తులు



శాయంపేట: నగర సంకీర్తనలో పాల్గొన్న హనుమాన్ భక్తులు



వేలేరు: అన్నదానం చేస్తున్న యాదగిరి

దామెర : మండలంలోని పులుకుర్తిలో హనుమాన్ మాలధారణ స్వాములు బుధవారం ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో ఆంజనేయ స్వామిని గ్రామంలో ఊరేగించారు. యాత్రలో భాగంగా స్వాములు భక్తి శ్రద్ధలతో సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాములకు స్వాగతం పలికారు. భక్తిగీతాలు ఆలపిస్తూ ఆనందంతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మెంతుల రాజు, గాజర్ల కృష్ణ, బొల్లం రఘు, పెంచాల సతీష్, రంజిత్, శ్రీను, అఖిల్, మహేష్, గోవిందు రవికుమార్, మోరె నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ఆలయం ప్రాంగణంలో బోరుబావి ఏర్పాటుకు పులుకుర్తి గ్రామానికి చెందిన శ్యామల పోతరాజు రూ.2 లక్షల విలువ చేసే మోటర్, పైపులు, విద్యుత్ వైర్లు అందజేశారు.

ఘనంగా సప్తశతి చండీయాగం

దామెర మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం సప్తశతి చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గుమ్మడివెల్లి సుబ్బయ్యశర్మ, అనురాగ్ శర్మ వేద మంత్రోచ్ఛరణ నడుమ ఉదయం శాంతిమంత్రం, మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధనం నిర్వహించిన అనంతరం అభయాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అలాగే శాస్త్రోక్తంగా లక్ష్మీగణపతి హోమం, సప్తశతి చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలం కృపాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు పోల్సాని శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మాదారపు రతన్ కుమార్, దుర్గనాల యోగేశ్వర్, అంబాల కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



దామెర: పులుకుర్తిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

హనుమాన్ నగరసంకీర్తన

శాయంపేట : మండలంలోని సూరంపేటలో హనుమాన్ నగర సంకీర్తనను మాలధారులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు వాసుదేవ మూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలోని పుర వీధుల గుండా హనుమాన్ భక్తులు భజనలతో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అడుప ప్రభాకర్, హనుమాన్ భక్తులు రాజు, రాంరెడ్డి, రఘు, శివ, కిట్టు, లక్ష్మణ్, సాయిరెడ్డి, రమేష్, వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులకు అన్నదానం

వేలేరు : మండల కేంద్రంలోని రుద్రరామేశ్వర ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు కుడా మాజీ అడ్వైజరీ డైరెక్టర్ బిల్లా యాదగిరి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న రోజుల్లో హనుమాన్ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాంరెడ్డి బుధవారం విరాళం అందజేశారు. గ్రామంలోని బీరప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.1,16,000 విరాళమిచ్చారు. ఈ సందర్భంగా దాతలు రాంరెడ్డిని, వారి తల్లిదండ్రులు రవీందర్ రెడ్డి- రమాదేవి(ఎంపీటీసీ) దంపతులకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పైడిపల్లి చెరువులో ఘర్షణ

పరకాల : మండలంలోని పైడిపల్లి చెరువు నుంచి నాగారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించడాన్ని అడ్డుకోబోయిన మాజీ సర్పంచ్ భర్త అడ్డికిల సురేష్‌కు ట్రాక్టర్ డ్రైవర్లకు ఘర్షణ జరిగింది. దీంతో తమ చెరువు నుంచి మట్టిని తరలించకూడదని.. గ్రామపంచాయతీకి ఒక్కో ట్రాక్టర్ మట్టికి రూ.100 చెల్లించాలన్నారు. లేనిపక్షంలో చెరువు నుంచి మట్టి వెళ్లనివ్వబోమని అడ్డుకోవడంతో తాము పంటపొలాలకు తరలిస్తున్నామంటూ నాగారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు గొడవకు దిగారు.దీంతో వాగ్వావాదం పెరిగి దాడికి దారితీసినట్లు సమాచారం. తనపై జరిగిన దాడికి నాగారం మాజీ సర్పంచ్ భర్త దేవేందర్‌రెడ్డితో పాటు మరికొందరు ట్రాక్టర్ డ్రైవర్లపై సురేష్ పరకాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

దామెర : గ్రామాల్లోని నర్సరీల్లో హరితహారం మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో నాటిన హరితహారం మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పోయాలని తెలిపారు. ఎక్కడైతే మొక్కలు ఎండిపోయాయో వాటి స్థానంలో వేరే మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం మొక్కలు నాటే స్థలాలను గుర్తించి, తీర్మానాలు చేయాలని సూచించారు. అదే విధంగా ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కమ్యూనిటీ సోక్ ఫీట్లు ఏర్పాట్లు చేయాలని వెల్లడించారు. సమావేశంలో ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

పరకాల : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు హార్టికల్చర్ పంటలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పండ్ల తోటల పెంపకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పరకాల మండలానికి ఈజీఎస్ ద్వారా పండ్లతోటల పెంపకానికి 70 ఎకరాల మంజూరు అయినందున అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్, ఆధార్ కార్డు జాబ్‌కార్డు, సెల్ ఫోన్ నంబర్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ ప్రతులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్, ఏపీఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నీళ్లనుకుని టర్పంటైల్ తాగిన బాలుడు

పరకాల : తాగునీరు అనుకొని నాలుగేళ్ల బాలుడు టర్పంటైల్ (రంగుల్లో కలిపే రసాయనం) తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన బుధవారం పరకాలలో చోటుచేసుకుంది. కొత్త మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలోని బేడ బుడిగజంగాల కాలనీకి చెందిన శేఖర్ తన ఇంటి పక్కనే షెడ్డు కోసం ఉపయోగించే రాడ్లకు రంగుల కోసం కుమారుడు(బిట్టు)ను వెంట తీసుకొని వెళ్లాడు. ఇంటికి వస్తున్న సమయంలో శేఖర్ తన కుమారుడిని వాహనంపై వదిలిపెట్టి పక్కనే దుకాణంలోకి వెళ్లాడు. ఇంతలో ఆ బాలుడు మంచినీళ్లు అనుకొని టర్పంటైల్ తాగేశాడు. ఉన్నట్టుండి కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భయపడిన బాలుడి తండ్రి శేఖర్ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించగా, అక్కడ చికిత్స అందిస్తున్నారు.

'అనుమతి లేని కళాశాలను మూసివేయాలి'

వరంగల్: నగరం నడిబొడ్డున పోచమ్మ మైదాన్‌లో అనుమతి లేకుండా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలను మూసివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. పోచమ్మమైదాన్‌లోని కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా బానర్లు, కరపత్రాల ద్వారా చేస్తున్న ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని సూచించారు. అనుమతి లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటున్నారని, విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలపై ఇంటర్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, పోస్టర్లను తొలగించాలని లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వరంగల్ నగరంలో పలు ప్రైవేట్ కళాశాలలకు అనుమతి, షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా ఆ కళాశాలలో పేర్లతో ఫ్లెక్సీలు కట్టి విద్యార్థులను మోసం చేస్తున్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు చెప్పినా కూడా స్పందన లేదని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ మండల నాయకులు సూర్యవంశీ, శ్రావణ్ శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీపై గొల్లకురుమలకు హామీ ఇవ్వాలి

వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గొల్ల కురుమలకు నగదు బదిలీపై ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. ఎంజీఎం సమీపంలోని జేడీ కార్యాలయంలోని డాక్టర్ అసోసియేషన్ బిల్డింగ్ హాల్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి 80 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం సగం మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేసి గొల్ల కురుమలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాడబోయిన లింగయ్య, అవిశెట్టి శంకరయ్య, తుషాకుల లింగయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొల్లం అశోక్, సాదం రమేష్, మద్దెపురం రాజు, పరికి మధుకర్, కాల్వ సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

గొర్రెల పంపిణీపై మాట తప్పిన ప్రభుత్వం

కాజీపేట: పార్టీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే గొర్రెల స్కీమ్‌ను అమలు చేస్తామని ప్రకటించిన నేటి ప్రభుత్వం.. ఇచ్చిన మాటను తప్పి లబ్ధిదారులకు డీడీలను వాపస్ చేయడం బాధాకరమని ఉమ్మడి వరంగల్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ విమర్శించారు. సోమిడిలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను మోసం చేయగా, ఇప్పటి కాంగ్రెస్ సర్కారు కూడా అదే దారిలో పయనిస్తోందన్నారు.

బ్లాక్‌లో విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దామెర: సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్



నడికూడ : స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాల ప్యాకెట్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

దామెర : పత్తి, వరి విత్తనాలు బ్లాక్‌లో విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఫర్టిలైజర్స్, విత్తనాల దుకాణాల యజమానులతో బుధవారం అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, డిమాండ్ విత్తనాల కొరత సృష్టించే వారిపై చర్యలు తప్పవని సూచించారు. దుకాణదారులను నమ్మి రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తారని, అలాంటి రైతులను మోసం చేయడం సరికాదని హితవు పలికారు. దుకాణాల్లో నిర్వహించే క్రయ,విక్రయాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని వెల్లడించారు. సమావేశంలో ఏఈఓ శివలీల, దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి

నడికూడ : పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తూ, రైతులను ఇబ్బంది పెడుతున్న షాపులపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న సీడ్స్, ఫర్టిలైజర్ షాపులను నియంత్రించేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. అందులో భాగంగానే మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలోని మా వెంకటేశ్వర్లపల్లి రైతు డిపో షాపులో ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వ చేసిన యూఎస్-7067 (300 ప్యాకెట్లు), 2ఎన్‌బీసీ బీజీ-2 సాకేత్ (30 ప్యాకెట్లు) మొత్తం రూ.2,85,125 విలువ చేసే 330 పత్తి విత్తనాల ప్యాకెట్లను ఏఓ శ్రీనివాస్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని సీజ్ చేసి విచారణ నిమిత్తం పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు రాజు, రవికుమార్, ఎస్సైలు నిస్సార్ పాషా, శరత్, సిబ్బంది, పరకాల ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ చోరీ

వేలేరు : ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఎస్సై హరిత తెలిపిన కథనం ప్రకారం మండలంలోని పీచర శివారు వేములపల్లి గ్రామంలో ఈనెల 27న రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీ చేసిన కాపర్ వైర్ విలువ రూ.5 వేలు ఉంటుందని ఏఈఈ కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సైకి అభినందన



ప్రశంసపత్రం అందుకుంటున్న ప్రమోద్‌కుమార్

శాయంపేట : వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా బుధవారం తన చాంబర్‌లో శాయంపేట ఎస్సై ప్రమోద్‌కుమార్‌కు ప్రశంసపత్రం అందించి అభినందించారు. ఇటీవల నిర్వహించిన పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పగడ్బందీగా ప్రశాంత వాతావరణంలో సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించినందుకు అభినందించినట్లు ఎస్సై తెలిపారు. సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న ఎస్సై ప్రమోద్‌కుమార్‌ను శాయంపేట సర్కిల్ సీఐ రంజిత్‌రావు పోలీస్ సిబ్బంది అభినందించారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ధర్మసాగర్ : పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఏఎన్ఓ టి.గణేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023- 24 సంవత్సరానికి 30 మంది విద్యార్థులు ఎన్‌సీసీ పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. బుధవారం ఎల్బీ కళాశాలలో 10(టి) బెటాలియన్ వరంగల్ నుంచి కేడెట్స్ బీ.సర్టిఫికెట్ అందుకున్నారు. బీ.సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లోను, పై చదువుల్లోనూ ప్రత్యేక కోటా ఉంటుందని ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలని ఆయన కోరారు. ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ లయన్స్ క్లబ్ పరకాల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆప్తాల్మిక్ డాక్టర్ జి.వెంకటనారాయణ 86 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి చూపు మందగించిన 30 మందికి సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో జూన్‌లో ఉచిత శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. వీరికి ఉచిత రవాణా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ వెంకన్న, ప్రజ్వల్ కంపెనీ ప్రతినిధులు ఎస్కే గౌస్, ఫీల్డ్ ఫెసిలిటర్స్ వంశీ, భానుమతి, తిరుపతి, రవిచందర్, రాంబాబు, కల్పన, భారతి, ధనలక్ష్మి, రైతులు లింగారెడ్డి, తిరుపతి రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఈడబ్ల్యూఎస్‌తో పేద విద్యార్థులకు ప్రయోజనం

హసన్‌పర్తి: ఈడబ్ల్యూఎస్‌తో అగ్రవర్ణ నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి అన్నారు. కాకతీయ రెడ్డి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా 10వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని గోపాలపురంలోని కేజీఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌ను పరిశీలించాలని, సవరించాలని జస్టిస్ ఈశ్వరయ్య బాహాటంగానే పేర్కొన్నారని, దాన్ని తిప్పికొట్టేందుకు రెడ్డిలు ఐక్యంగా ఉండాలని సూచించారు. రెడ్డి కార్పొరేషన్ విధి విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రెడ్డి సంఘాలకు కాకతీయ రెడ్డి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం పునాదిగా పేర్కొన్నారు. సంఘం నాయకులు కంది గోపాల్‌రెడ్డి, రాధారపు సంజీవరెడ్డి, యాదిరెడ్డి, అశోక్‌రెడ్డి, కేశవరెడ్డి, నరహరి, తిరుపతిరెడ్డి, మనోజ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.